

కార్పొరేట్ ఆస్పత్రుల కక్కుర్తి

- పరీక్షల పేరుతో సిబ్బందిపై వేటు
- ఉన్నవారిపై పెరుగుతున్న పనిభారం
- రోగులకు చికిత్సలపై ప్రభావం

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

కార్పొరేట్ ఆస్పత్రులకు యాజమాన్యాలే వాటికి సూపర్ బాస్‌లు. అక్కడ రాజ్యాంగం, చట్టం వర్తించవు. ఉద్యోగులంటే వారికి బానిసల కిందే లెక్క. పనిగంటలు కాగితాలకే పరిమితం. ఉద్యోగ భద్రత ఎప్పుడూ ప్రశ్నార్థకమే. ఎంత వేధించినా ఉద్యోగులు తమలో తాము కుమిలిపోవాల్సిందే. అలా కాదని హక్కుల కోసం అడిగేందుకు ప్రయత్నిస్తే ఇక ఉద్యోగం ఊడినట్టే. ఇటీవల ఒక కార్పొరేట్ ఆస్పత్రిలో పలువురు సీనియర్లను తొలగించేందుకు రంగం సిద్ధం చేశారు. ఆదనపు సిబ్బంది లేకపోయినా, ఉన్న సిబ్బంది సరిపోని సమయంలో ఇంకా సిబ్బందిని తీసుకోకపోగా ఉన్న సిబ్బందినే తొలగించేందుకు తెగబడ్డారు. బెడ్లు, రోగుల నిష్పత్తి, అందించే సేవల ఆధారంగా ఆయా ఆస్పత్రుల్లో ఎంత మంది డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది ఉండాలనే విషయాలను ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాలు స్పష్టంగా నిర్దేశించాయి. ఈ నిష్పత్తిలో ఏ ఒక్క ఆస్పత్రి సిబ్బందిని నియమించుకోలేదనే విషయం బహిరంగ రహస్యమే. సర్కారు చూసి చూడని వైఖరితో కార్పొరేట్ ఆస్పత్రుల ఆగడాలు రోజు రోజుకు మితిమీరుతున్నాయి.

ప్రచారం, బ్రాండ్‌తో ఆస్పత్రులను నడిపిస్తుండడంతో ఇక అధిక జీతాలు ఇచ్చే వారిని పంపించాలని భావిస్తున్నారు. అయితే ఇందుకోసం ఐటీ కంపెనీల మాదిరిగా ఉద్యోగుల సర్వీసు మధ్యలో వారి సమర్థతను తెలుసుకునేందుకని పరీక్షలు పెడుతున్నట్టు సమాచారం. ఈ పరీక్షలను కొత్త నియమించుకునే వారితో కలిపి అప్పటికే విధుల్లో ఉన్నవారికి నిర్వహిస్తున్నారు. ఇందులో ఏ మాత్రం తక్కువ మార్కులు వచ్చినా మీ స్థాయికి తగ్గ ఆస్పత్రిని చూసుకోవాలని చెబుతున్నారు. జీతం వస్తున్న పేరే గాని దానికి తగినట్టు అప్పులు, చెల్లింపులు, ఆయా ఆస్పత్రులకు దగ్గర ఇండ్లు, పిల్లల చదువులు అంతా సిద్ధం చేసుకున్న తర్వాత ఉన్నపళంగా తొలగిస్తే తట్టుకోలేమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు సిబ్బందిని తగ్గిస్తూ ఖర్చులు ఆదా చేస్తున్నా రోగుల ఫీజులు మాత్రం అమాంతం పెంచేస్తున్నారు. సాధారణ డాక్టర్ ను సంప్రదించేందుకు రూ.500 నుంచి రూ.1000 వరకు వసూలు చేస్తుండగా, ప్రత్యేక వైద్యనిపుణులైతే రూ.1000 నుంచి రూ.2000 వరకు తీసుకుంటున్నారు. అదే స్థాయిలో సౌకర్యాలు, వైద్యసిబ్బందిని మాత్రం అందుబాటులో ఉంచడం లేదు. ఆయా ఆస్పత్రుల్లో బెడ్లు, డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది వివరాలను బహిరంగంగా ప్రదర్శిస్తే తప్ప కార్పొరేట్ ఆస్పత్రులను గాడిన పెట్టే పరిస్థితి లేదు. టీఆర్ఎస్ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటే తప్ప కార్పొరేట్ ఉద్యోగుల భద్రతకు భరోసా దొరికే అవకాశం లేదు.

రాష్ట్రంలో కొత్తగా ఆరు కరోనా కేసులు

- మంత్రి ఈటల వెల్లడి

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో శుక్రవారం కొత్తగా ఆరు కరోనా పాజిటివ్ కేసులు నమోదైనట్లు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ వెల్లడించారు. వీటితో కలిపి మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 1,044కు చేరిందని తెలిపారు. కరోనా నుంచి కోలుకున్న 22 మంది బాధితులు శుక్రవారం డిశ్చార్జి అయ్యారని చెప్పారు. వీరుగాక మరో 552 యాక్టివ్ కేసులున్నాయని తెలిపారు. కరోనాతో ఇప్పటి వరకూ 28 మంది మరణించారని వివరించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో లాక్‌డౌన్ సంపూర్ణంగా అమలవుతుందని తెలిపారు. ప్రజలు ప్రభుత్వానికి అన్ని విధాలుగా సహకరించడం వల్లే ఇది సాధ్యమవుతుందని వివరించారు. సిఎం కేసీఆర్ పిలుపుతో ప్రతి ఒక్కరూ లాక్‌డౌన్‌కు సహకరిస్తున్నారని చెప్పారు. ఎక్కువ సంఖ్యలో టెస్టులు చేయకపోవడం వల్లే కరోనా కేసులు తక్కువగా నమోదవుతున్నాయనే ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఎక్కడ పడితే అక్కడ టెస్టులు చేయొద్దంటూ ఐసిఎంఆర్ నిబంధన విధించిందని గుర్తు చేశారు. ఎవరికైనా కరోనా లక్షణాలున్నాయని తేలితేనే పరీక్షలు చేయాలంటూ సూచించిందని తెలిపారు. అలాంటి లక్షణాలు ఉంటేనే ఆస్పత్రిలో చికిత్స చేయాలంటూ మార్గదర్శకాలు చెబుతున్నాయని వివరించారు. ఎలాంటి పరిస్థితి ఎదురైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

మిథానీ సిఎండిగా ఎస్‌కె ఝూ

ప్రజాశక్తి – బిజినెస్ బ్యూరో

ప్రముఖ రక్షణ రంగ ఉత్పత్తుల కంపెనీ మిథానీకి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా డాక్టర్ సంజయ్‌కుమార్ ఝూ నియమితులయ్యారు. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఆయన మిథానీలో డైరెక్టర్ (ప్రొడక్షన్ అండ్ మార్కెటింగ్)గా పని చేశారు. మొదటిగా న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ (ఎన్ఎఫ్‌సి)లో పని చేశారు. ఆ తరువాత వివిధ విభాగాలు, శాఖల్లో సేవలందించారు.

రోగ నిరోధక శక్తి తగ్గితే కరోనా వ్యాప్తి

- ప్రొఫెసర్ డాక్టర్ శ్యాం సుందర్‌రాజు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిలో కరోనా వైరస్ వ్యాప్తికి ఆస్కారముంటుందని గాంధీ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ శ్యాం సుందర్‌రాజు తెలిపారు. ఇతర దేశాలతో పోలిస్తే మన దేశంలో వైరస్ వ్యాప్తి తక్కువగా ఉందని చెప్పారు. లాక్‌డౌనే ఇందుకు ప్రధాన కారణమని వివరించారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. వైరస్ తగ్గాలంటే సోషల్ ప్రివెంటివ్ మెథడ్స్, మెడికేషన్, వాక్సినేషన్ లాంటి మార్గాలున్నాయని చెప్పారు. భౌతిక దూరం పాటించటం, చేతులను ఎప్పటికప్పుడు కడుక్కోవడం, మాస్క్‌లు ధరించడం తదితరాలు సత్ఫలితాలిస్తాయని తెలిపారు. వాక్సినేషన్‌కు సంబంధించిన పరిశోధనలు జరుగుతున్నాయని ఆయన చెప్పారు.

మేడే రోజున విషాదం

క్రేన్ ఢీకొని దినసరి కూలి మృతి

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

క్రేన్ డ్రైవర్ నిర్లక్ష్యానికి దినసరి కూలి ప్రాణం కోల్పోయిన ఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూర్ మండలం పారిశ్రామిక ప్రాంతంలో శుక్రవారం జరిగింది. కొత్తూర్ సిఐ వివరాల ప్రకారం.. కొత్తూర్ మండలం తీగపూర్ గ్రామానికి చెందిన యాదమ్మ(55) శివారులో ఉన్న గ్రీన్ ప్లాస్టిక్ పరిశ్రమలో దినసరి కూలిగా పనిచేస్తుంది. మధ్యాహ్నం నీళ్ల తాగి పని చేసేందుకు వెళ్తుండగా క్రేన్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల యాదమ్మను ఢీకొని ప్రహరీ గోడను ఢీకొట్టాడు. గోడకు, క్రేన్ మధ్యలో యాదమ్మ ఇరుక్కుపోవడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి కుమారుడు నర్సింహ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్పొరేట్లకు మోడీ సర్కారు వత్తాసు

- కార్మికుల హక్కులు హరిస్తే సహించం
- సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి, జి నాగయ్య
- ఎంబి భవన్‌లో మేడే వేడుకలు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

కరోనా లాక్‌డౌన్ సమయంలోనూ మోడీ సర్కారు పెట్టుబడిదారులు, సంపన్నులకు కొమ్ముకాస్తున్నదని సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, జి నాగయ్య విమర్శించారు. లాక్‌డౌన్‌లో ఇబ్బంది పడుతున్న పేదలు, ఉపాధి, తిండిలేక బాధపడుతున్న వలస కార్మికులు, అసంఘటిత కార్మికుల సంక్షేమాన్ని కేంద్రం విస్మరించిందన్నారు. కరోనా పేరుతో కార్మికులు ఐక్యం కాబోరనే ఉద్దేశంతో హక్కులను హరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం ఎంబి భవన్‌లో మేడే వేడుకలు జరిగాయి. సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు ఎర్రజెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా నేపథ్యంలో మేడే వేడుకలు జరుపుతున్నామని అన్నారు. కరోనా తీవ్రత దృష్ట్యా ప్రదర్శనలు, ఎక్కువ మందితో సభలు, సమావేశాలు నిర్వహించడం లేదన్నారు. ప్రజలు, కష్టజీవుల ఆరోగ్యం ప్రధానమని వివరించారు.క్లిష్ట సందర్భంలో ప్రజలకు కమ్యూనిస్టులు ముఖ్యంగా సిపిఐ(ఎం) శ్రేణులు, ప్రజా సంఘాల కార్యకర్తలు సేవ చేస్తున్నారని గుర్తు చేశారు. కార్మికుల ప్రయోజనాల కోసం భవిష్యత్తులోనూ పనిచేస్తామన్నారు. అన్ని రంగాల్లో అస్తవ్యస్థమైన పరిస్థితి వచ్చిందన్నారు. లాక్‌డౌన్ ఎత్తేసినా రానున్న కాలంలో గడ్డు పరిస్థితులు ఉత్పన్నమవుతాయని అన్నారు. మరిన్ని పోరాటాలకు, సేవకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య మాట్లాడుతూ ఎనిమిది గంటల పనివిధానాన్ని చికాగోలో కార్మికులు పోరాడి సాధించుకున్నారని గుర్తు చేశారు. లాక్‌డౌన్‌లో ప్రజలను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయని విమర్శించారు. పనిలేక, తిండిలేక పేదలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. 12 కిలోల బియ్యం, రూ.1,500 ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. బ్యాంకులను ముంచిన ఎగవేతదారులకు రూ.68 వేల కోట్లను కేంద్రం రద్దు చేసిందని వివరించారు. దేశంలోని పేదలను ఆదుకోవడానికి రూ.65 వేల కోట్లు ఖర్చు చేయాలని ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్‌రాజన్ సూచించారని గుర్తు చేశారు. దీనికి కేంద్రం సిద్ధంగా లేదన్నారు. ఎనిమిది గంటల పనివిధానం కోసం నాడు కార్మికులు రక్తం చిందించారని చెప్పారు. మోడీ ప్రభుత్వం దాన్ని 12 గంటల పనివిధానం తేవాలని ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. 12 గంటల పనివిధానం తెస్తే మేడే స్ఫూర్తితో ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.400 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలకు ఒక్కో కుటుంబానికి 50 కిలోల బియ్యం, రూ.7,500 ఇవ్వాలని కోరారు. వలస కార్మికులను స్వస్థలాలకు చేర్చేందుకు రవాణా సౌకర్యం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి వెంకట్, టి జ్యోతి, జాన్‌వెస్లీ, రాష్ట్ర కమిటీ సభ్యులు టి సాగర్, పి ఆశయ్య, సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, ఇతర నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

వృద్ధ, అనాథాశ్రమాలకు చేయూత నివ్వండి

- అవసరమైన భోజన సదుపాయాలు కల్పించండి
- రెడ్‌జోన్లలో ఏమాత్రం నిర్లక్ష్యం తగదు: డీజీపీ ఆదేశాలు

ప్రజాశక్తి– హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని వృద్ధాశ్రమాలు, అనాథాశ్రయాలలో భోజన సదుపాయాలు సరిగా ఉన్నాయా లేదా అనేది పర్యవేక్షించాలనీ రాష్ట్ర డీజీపీ మహేందర్‌రెడ్డి పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కరోనా మహమ్మారి వ్యాధి వ్యాప్తిని అరికట్టడంలో పోలీసులు వహిస్తున్న పాత్ర ఎన లేనిదని ఆయన కొనియాడారు. ఈ విషయంలో హోంగార్డులు మొదలుకుని ఐపిఎస్ అధికారుల వరకు ప్రతి ఒక్కరు బాధ్యతతో వ్యవహరిస్తున్నారని ఆయన అభినందించారు. అయితే రెడ్ జోన్ ఏరియాలతో పాటు మిగతా ఏరియాల్లో ఉన్న వృద్ధాశ్రమాలలో అనేక మంది కి తగిన సమయంలో భోజన సదుపాయాలతో పాటు అవసరమైన మందులు అందించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ విషయంలో కొన్ని స్వచ్ఛంద సంస్థలు, కార్యకర్తలు తమ సేవలను అందిస్తున్నారని అన్నారు. అయినప్పటికీ మరింతగా వారికి చేయూత అవసరమని ఆ ఆవసరాలను పూర్తి చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని పేర్కొన్నారు. వీరే గాక అనాథాశ్రమాలలో సైతం కొందరికి భోజనం లభించడం లేదని దృష్టికి వస్తోందన్నారు. ఆ దిశగా కూడా పోలీసు అధికారులు దృష్టిని సారించాలని విజ్ఞప్తి చేశారు. కాగా లాక్‌డౌన్‌ను సమర్థవంతంగా అమలు చేయడంలో రాష్ట్ర పోలీసులు కొనసాగించాలని కోరారు. ప్రధానంగా రెడ్‌జోన్ ఏరియాలలో ఏమాత్రం నిర్లక్ష్యం కూడదని అన్నారు. ఈ ప్రాంతాలలో వెలుపల ఎవరూ తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని లేక పోతే ఇప్పటి వరకు చేసిందంతా బూడిదలో పోసిన పన్నీరు అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం లాక్‌డౌన్‌ను ఎన్ని రోజులు కొనసాగించినా అందుకు ప్రతి పోలీసు విధి నిర్వాహణ చేయడానికి సంసిద్ధులుగా ఉండాలని కోరారు. వల కార్మికులను వారి సొంత ఊళ్లకు పంపించడంలో పూర్తిగా సహకరించాలని అధికారులను కోరారు. రాష్ట్రంలో కంటైన్మెంట్ ఏరియాలలో అమలు అవుతున్న భద్రతా చర్యలు, గస్తీ, లాక్‌డైన్ అమలును కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా సీనియర్ అధికారులు పర్యవేక్షిస్తున్నారని డీజీపీ తెలిపారు. లాక్‌డౌన్‌ను ఉల్లంఘించిన వాహనదారులపై కేసులను కచ్చితంగా నమోదు చేయాలనీ, ఇం దు లో ఎవరి సిఫారసులను కూడా పట్టించుకోరాదని ఆయన స్పష్టం చేశారు.

పంచాయతీ కార్మికులపై వివక్ష

- సీఎం ప్రోత్సాహకం కొందరికే పోతారా? పంచుకుంటారా? అంటూ జీతాలపైనా మెలిక
- లాక్‌డౌన్ సమయంలోనూ ఆగని తొలగింపు ప్రక్రియ
- పంచాయతీ కార్మికుల మెడపై సర్కారు కత్తి

ప్రజాశక్తి –హైదరాబాద్ బ్యూరో

"ప్రయివేటు యాజమాన్యాలు కరోనా కష్టకాలంలో ఏ ఒక్క కార్మికున్నీ తొలగించొద్దు...వేతనాలను తగ్గించొద్దు" అని చెబుతున్న సర్కారే లాక్‌డౌన్ సమయంలోనూ గ్రామ పంచాయతీ కార్మికుల తొలగింపు ప్రక్రియను కొనసాగిస్తున్నది. 2011 జనాభా లెక్కనే కార్మికులను ఉంచుకుంటాం...ఎవర్ని ఉంచాలో? ఎవర్ని తీసేయాలో? పోతారా? జీతాలు పంచుకుంటారా? మీరే తేల్చుకోండి అంటూ వేతనాల విషయంలో కార్మికుల మెడపై కత్తిపెట్టి కూర్చున్నది. మరోవైపు జనాలంతా ఇంట్లో కూర్చుంటే సైనికుల్లా పనిచేస్తూ కరోనా కట్టడి చర్యల్లో పాలుపంచుకుంటున్న పంచాయతీ కార్మికుల్లో కొందరికే సీఎం ప్రోత్సాహకం రూ.5 వేలు దక్కింది.

కరోనా కట్టడిలో భాగంగా పంచాయతీ కార్మికులందరూ నిరంతరాయంగా విధులను నిర్వర్తిస్తున్నారు. వైద్యసిబ్బంది, పోలీసులు, మున్సిపల్, గ్రామపంచాయతీ కార్మికులకు ప్రోత్సాహకాలను ఇవ్వాలని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు 43,600 మందికి ఇన్సెంటివ్ రూ.5 వేలు ఇస్తామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రకటించారు. కానీ, క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నంగా ఉంది. అన్ని కేటగిరీలు కలిపితేనే మంత్రి చెప్పిన ఈ సంఖ్య ఉంటుంది. ప్రస్తుతం పంచాయతీల్లో కరోనా డ్యూటీలు నిర్వహిస్తున్న వారందరికీ ఇవ్వకుండా అనేక షరతులు పెడుతూ కేవలం పారిశుధ్య కార్మికులకే ఇస్తున్నది. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లో వాస్తవానికి 30 మంది పంచాయతీ కార్మికులున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం అక్కడ 17 మందికి రూ.5 వేల ప్రోత్సాహకం ఇవ్వాలి. కానీ, 12 మందికే అందింది. రంగారెడ్డి జిల్లా యాచారంలో తొమ్మిది మందికి రావాల్సి ఉండగా ఆరుగురికే అధికారులు ఇన్సెంటివ్ ఇచ్చారు. కరోనా నివారణ డ్యూటీలు చేస్తున్న వాటర్‌మెన్లు, కారోబార్లు, బిల్‌కలెక్టర్లతో పాటు అన్ని కేటగిరీల సిబ్బందికి షరతులు లేకుండా సీఎం గిఫ్టు ఇన్సెంటివ్ ఇవ్వాలనీ, ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్ పంచాయతీ కార్మికుల నుంచి వ్యక్తమవుతున్నది.

లాక్‌డౌన్ కాలంలోనూ ఆగని తొలగింపు

విపత్కర పరిస్థితుల్లో గ్రామాల్లో మెరుగైన సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికులపై జీఓ నెంబర్ 51 పేరుతో రాష్ట్ర సర్కారు దయాదాక్షిణ్యం లేకుండా వ్యవహరిస్తున్నది. ఓ పక్క ప్రయివేటు సంస్థలు ఎట్టిపరిస్థితుల్లో ఉద్యోగాల నుంచి కార్మికులను తొలగించవద్దు...వేతనాలు కుదించవద్దు అని జీవోలను జారీచేస్తూనే పంచాయతీ కార్మికులను తొలగించే ప్రయత్నాలను ఆపట్లేదు. లాక్‌డౌన్ సమయంలోనూ నిర్దాక్షిణ్యంగా కార్మికులను తీసేస్తున్నది. జనగామ జిల్లా దేవరుప్పల మండలం పోచారం గ్రామం జనాభా రెండు వేలు. అక్కడ ఐదుగురు కార్మికులున్నారు. 500 జనాభా లెక్కల ప్రకారం అంటూ రామచంద్రం అనే కార్మికున్ని అధికారులు, సర్పంచ్ తీసేశారు. 15 ఏండ్లుగా కష్టనష్టాలకోరుస్తూ పనిచేస్తున్న రామచంద్రం, తన భార్య, కుటుంబ సభ్యులతో కలిసి సర్పంచ్ ఇంటి ముందు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసుకునేందుకు యత్నించారు. దీంతో రామచంద్రం తొలగింపును తాత్కాలికంగా ఆపేశారు. ఇంత జరుగుతున్నా రంగారెడ్డి జిల్లా యాచారంలో 15 మందిలో ఆరుగుర్ని తీసేసినట్టు సమాచారం. 2011 జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకుని పంచాయతీల్లో 500 మంది జనాభాకే ఒక కార్మికున్ని ఉంచుతామని చెప్పటం దారుణం. ఈ విధంగా జీవో నెంబర్ 51 అమలు చేస్తే సిరిసిల్ల జిల్లాలో 350 మంది, నిజామాబాద్ జిల్లాలో 500 మంది, నల్లగొండ జిల్లాలో 500 మంది, యాదాద్రి భువనగిరి జిల్లాలో 500 మందికిపైగా కార్మికులను తమ ఉద్యోగాలను కోల్పోయే దుస్థితి నెలకొంది. పాత జనాభా లెక్కల ప్రకారం కాకుండా సమగ్ర కుటుంబ సర్వే ద్వారా వచ్చిన లెక్కల ప్రకారం అయితే ప్రస్తుతం ఉన్న సిబ్బంది సరిపోతారు. దీనికి తోడు కొత్త పంచాయతీల్లో 17 వేల దాకా ఖాళీలున్నట్టు కార్మిక సంఘాలు చెబుతున్నాయి. పాతపంచాయతీల్లో ఏమైనా ఎక్కువ ఉంటే అడ్జెస్ట్ చేయాలని సూచిస్తున్నాయి. ప్రభుత్వం మాత్రం ఆవైపుగా ఆలోచించట్లేదు.

ఇన్సెంటివ్ ఇవ్వాలి..తొలగింపులు ఆపాలి : పాలడుగు భాస్కర్, గౌరవాధ్యక్షులు
తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్

కరోనా నివారణ విధులు నిర్వర్తిస్తున్న పారిశుధ్య కార్మికులతో పాటు వాటర్‌మెన్లు, కారోబార్, బిల్‌కలెక్టర్‌తోపాటు అన్ని కేటగిరీల సిబ్బందికి సీఎం ప్రోత్సాహకం రూ.5వేలు ఇవ్వాలి. 2011 జనాభా లెక్కల ప్రకారం కాకుండా ప్రస్తుత గ్రామ జనాభాను పరిగణనలోకి తీసుకుని గ్రామపంచాయతీ కార్మికులను నియామకాలుండాలి. అదనం సాకుతో 15, 20 ఏండ్ల సంది పనిచేస్తున్న కార్మికులను తొలగించడం అన్యాయం. కొత్త పంచాయతీల్లో ఖాళీగా ఉన్న 17 వేల పోస్టుల్లో అడ్జెస్ట్ చేస్తే బాగుంటుంది.

కష్టపడ్డాం...మా పొట్టలు కొట్టొద్దు : యాదమ్మ, పంచాయతీ కార్మికురాలు, బీబీనగర్

కష్టపడ్డాం. మా పొట్టలు కొట్టొద్దు. 240 రూపాయల జీతం ఉన్నప్పటి నుంచి చేస్తున్నా. సంవత్సరానికి రెండుమూడు సార్లు జీతాలిచ్చినా ఎన్నడైనా గవర్నమెంట్ కాకపోతదా? బతుకులు మారకపోతయా? అన్న ఆశతోనే చేస్తున్నం. తీరా జీతం రూ.8500 అయినంక తొలగించడం అన్యాయం. గిదే పనిని నమ్ముకుని బతుకుతున్న మా పొట్టలు కొట్టొద్దు.

కుమార్తె గొంతు కోసి హత్య

లాక్‌డౌన్‌తో మానసిక రోగిగా మారిన తండ్రి

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

లాక్‌డౌన్‌తో పనుల్లేక.. కుటుంబ పోషణ భారం కావడంతోపాటు.. ఎటూ వెళ్లలేని పరిస్థితుల్లో మానసిక రోగిలా మారిన ఓ వ్యక్తి.. కన్న కూతురి గొంతు కోసి హత్య చేశాడు. ఈ హృదయవిదారక సంఘటన శుక్రవారం సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొంగ్లూర్ తండాకు చెందిన రామావత్ జీవన్ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. లాక్‌డౌన్ కారణంగా నెల రోజులుగా పని లేదు. దీంతో కుటుంబ పోషణ కష్టంగా మారడంతో జీవన్ మానసికంగా బాగా కుంగిపోయాడు. గురువారం రాత్రి సుమారు 10 గంటలకు అందరూ నిద్రిస్తున్న సమయంలో కుమార్తె అవంతిక (4)ను కత్తితో గొంతు కోసి చంపాడు. విషయం తెలియగానే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి నిందితున్ని అదుపులోకి తీసుకున్నారు.

ఫీజులు అడగొద్దు

- ప్రవేశాలు చేపడితే చర్యలు
- యాజమాన్యాలకు ఇంటర్ బోర్డు హెచ్చరిక

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

లాక్‌డౌన్‌ను ఈ నెల 17 వరకు కేంద్ర ప్రభుత్వం మరోసారి పొడిగించిందని ఇంటర్ బోర్డు ప్రకటించింది. ఈ సమయంలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల ప్రక్రియను చేపట్టకూడదనీ, విద్యార్థులను ఫీజులు అడగొద్దనీ సూచించింది. నిబంధనలు ఉల్లంఘిస్తే కాలేజీల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి సయ్యద్ ఉమర్ జలీల్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కరోనా కేసుల తీవ్రత దేశవ్యాప్తంగా ఉందని తెలిపారు. ఈ సమయంలో వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రయివేటు జూనియర్ కాలేజీల యాజమాన్యాలు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో కాలేజీల్లో చేరాలనీ, ఫీజులు చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిడి తేవొద్దని కోరారు. పదో తరగతి పరీక్షలు ఇంకా పూర్తి కాలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం కాలేజీలకు సెలవులున్నాయని తెలిపారు. ఇంకోవైపు వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రయివేటు కాలేజీలకు అనుబంధ గుర్తింపు ఇవ్వలేదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే యాజమాన్యాలు, కాలేజీల ప్రిన్సిపాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్ రెడ్డి

వ్యవసాయ రంగం బలోపేతంతోనే అందరికీ ఉపాధి

వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడంతోనే రాష్ట్రంలో ఎక్కువ మందికి ఉపాధి కల్పించొచ్చని ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. 'వరికి ప్రత్యామ్నాయ పంటలు – పంటల మార్పిడి' అంశంపై వ్యవసాయశాఖ, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని వర్సిటీ ఆడిటోరియంలో శుక్రవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజానీకంలో అత్యధిక శాతం వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై ఆధారపడి ఉన్నారనీ, వారికి అధిక ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. అధిక ఆదాయం వచ్చే పంటలపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఉత్పత్తి, ఉత్పాదకతల్లో అంతర్జాతీయ స్థాయి సాధించాలని ఆకాంక్షించారు. మన అవసరాలకు సరిపోగా మిగిలిన వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేసే అంశంపై దృష్టి పెట్టాలని పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ సూచించారు. సమావేశంలో ప్రణాళిక సంఘం వైస్ చైర్మెన్ వినోద్‌కుమార్, రైతు సమన్వయ సమితి చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పౌర సరఫరాల సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, వర్సిటీ ఉప కులపతి డాక్టర్ వి.ప్రవీణ్ రావు, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఆవాజ్ ఆధ్వర్యంలో నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

ఆవాజ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ పాతబస్తీలోని పేద ముస్లింములకు నిత్యావసరాలను శుక్రవారం పంపిణీ చేశారు. చాంద్రాయణగుట్ట, బాబానగర్, జంగంమెట్, బహుదూర్‌పుర, కాలపత్తార్, ఫారూఖ్‌నగర్, వట్టేపల్లి, మలక్‌పేట, ఆల్‌జబేర్‌కాలే, చాదర్‌ఘాట్‌లలో 150 కుటుంబాలకు బియ్యం, నూనె, గోధుమపిండి, కారం తదితర నిత్యావసరాలతో కూడిన కిట్లను అందజేశారు. కార్యక్రమంలో పట్నం రాష్ట్ర కార్యదర్శి డీజీ నరసింహారావు, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎమ్‌డీ అబ్బాస్, ఎల్.కోటయ్య, అఫ్జల్‌బేగం, అసియా, సాజీదా, జాఫ్రీభాను, హూర్‌చాను, తదితరులు పాల్గొన్నారు.

పని గంటలపై మరో పోరాటానికి సిద్ధం

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సాయిబాబు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

పని గంటల పెంపు యోచనను మే డే స్ఫూర్తితో తిప్పికొట్టాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సాయిబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం మే డే సందర్భంగా ఖమ్మం త్రీటౌన్‌లో సిఐటియు జెండా ఎగురవేసి మాట్లాడారు. కరోనా లాక్‌డౌన్‌తో రాబోతున్న ఆర్థిక సంక్షోభ భారాలను పెట్టుబడిదారులు ప్రభుత్వాల సహకారంతో కార్మికవర్గంపై మోపాలని చూస్తున్నారనీ, దానిలో భాగంగానే జీతాల్లో కోత, పని గంటల పెంపు అనీ వివరించారు. మే డే స్ఫూర్తితో భవిష్యత్ ఐక్య పోరాటాలకు కార్మిక వర్గం సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఐక్యతతో కరోనాను ఎదుర్కొందాం : జూలకంటి

ఐక్యతతో కరోనాను ఎదుర్కొందామని సిపిఐ(ఎం)రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో పలుచోట్ల జెండావిష్కరణలు చేసి మాట్లాడారు. కరోనా కట్టడికి కేరళ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. తెలంగాణలోనూ ఆ తరహా వైద్య సేవలందించాలని సూచించారు.

కుమార్తె గొంతు కోసి హత్య

లాక్‌డౌన్‌తో మానసిక రోగిగా మారిన తండ్రి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లాక్‌డౌన్‌తో పనుల్లేక.. కుటుంబ పోషణ భారం కావడంతోపాటు.. ఎటూ వెళ్లలేని పరిస్థితుల్లో మానసిక రోగిలా మారిన ఓ వ్యక్తి.. కన్న కూతురి గొంతు కోసి హత్య చేశాడు. ఈ హృదయవిదారక సంఘటన శుక్రవారం సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొంగ్లూర్ తండాకు చెందిన రామావత్ జీవన్ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. లాక్‌డౌన్ కారణంగా నెల రోజులుగా పని లేదు. దీంతో కుటుంబ పోషణ కష్టంగా మారడంతో జీవన్ మానసికంగా బాగా కుంగిపోయాడు. గురువారం రాత్రి సుమారు 10 గంటలకు అందరూ నిద్రిస్తున్న సమయంలో కుమార్తె అవంతిక (4)ను కత్తితో గొంతు కోసి చంపాడు. విషయం తెలియగానే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి నిందితున్ని అదుపులోకి తీసుకున్నారు.

మేడే రోజున విషాదం

క్రేన్ ఢీకొని దినసరి కూలి మృతి

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

క్రేన్ డ్రైవర్ నిర్లక్ష్యానికి దినసరి కూలి ప్రాణం కోల్పోయిన ఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూర్ మండలం పారిశ్రామిక ప్రాంతంలో శుక్రవారం జరిగింది. కొత్తూర్ సిఐ వివరాల ప్రకారం.. కొత్తూర్ మండలం తీగపూర్ గ్రామానికి చెందిన యాదమ్మ(55) శివారులో ఉన్న గ్రీన్ ప్లాస్టిక్ పరిశ్రమలో దినసరి కూలిగా పనిచేస్తుంది. మధ్యాహ్నం నీళ్లు తాగి పని చేసేందుకు వెళ్తుండగా క్రేన్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల యాదమ్మను ఢీకొని ప్రహరీ గోడను ఢీకొట్టాడు. గోడకు, క్రేన్ మధ్యలో యాదమ్మ ఇరుక్కుపోవడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి కుమారుడు నర్సింహ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రంలో నెలాఖరు వరకూ లాక్‌డౌన్..?

ప్రభుత్వ యోచన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశవ్యాప్తంగా ఈ నెల 17 వరకు లాక్‌డౌన్‌ను కేంద్రం పొడిగించిన నేపథ్యంలో రాష్ట్రంలో అంతకుమించి లాక్‌డౌన్‌ను పొడిగించనున్నారా..? అంటే అవుననే అంటున్నాయి ప్రభుత్వ వర్గాలు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ మేరకు ఉన్నతాధికారులతో సమాలోచనలు చేసినట్టు తెలిసింది. ఈ నెల ఐదున నిర్వహించబోయే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు చర్చించి నిర్ణయించనున్నారు. అనంతరం సిఎం కెసిఆర్ స్వయంగా లాక్‌డౌన్ పొడిగింపు గురించి వెల్లడించనున్నారని సమాచారం. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో గత కొద్ది రోజులలోగా కేసులు తగ్గుతూ వచ్చినప్పటికీ గురువారం ఒక్కసారిగా 22 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. మరోవైపు హైదరాబాద్‌తోపాటు చుట్టుపక్కల జిల్లాలైన మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్‌ను కేంద్రం రెడ్‌జోన్లుగా ప్రకటించింది. ఈ క్రమంలో ఒక్క జిహెచ్‌ఎంసి పరిధిలోనే కోటిన్నరకు పైగా జనాభా ఉండటం, గత వారం రోజులుగా నమోదవుతున్న కేసులన్నీ ఇక్కడివే కావటం తదితర కారణాల రీత్యా... ఈనెలాఖరు వరకూ లాక్‌డౌన్ పొడిగించటమే మేలని ప్రభుత్వం భావిస్తున్నది. దీంతోపాటు రంజాన్ మాసం నేపథ్యంలో.. లాక్‌డౌన్ ఎత్తేస్తే గూమికూడకుండా ప్రజలను నిలువరించలేమనీ, ఫలితంగా ఇబ్బందికర పరిస్థితులు తలెత్తే అవకాశముందని సర్కారు భావిస్తుంది. ఈ కారణాలన్నింటి రీత్యా లాక్‌డౌన్ పొడిగింపునకు మొగ్గు చూపుతున్నట్టు తెలిసింది.

తెగులు గుబులు

- 'అగ్గి' వైరస్ సోకి పొట్టదశలో పంట బుగ్గి
- రోజుల వ్యవధిలోనే గోధుమరంగు మచ్చలు
- తాటాకుల్లా ఎండిపోతున్న వరి పైరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అగ్గితెగులు వైరస్ రాష్ట్ర రైతాంగాన్ని బుగ్గి చేస్తున్నది. వరిపైరు కంకులు వేస్తున్న పొట్టదశలో ఈ తెగులు వ్యాప్తిచెంది, రోజుల వ్యవధిలోనే ఎదిగిన పైరంతా తాటాకుల్లా ఎండిపోతున్నది. గోధుమరంగు మచ్చలతో పచ్చటిపైర్లు తగలబడి పోతున్నట్టుగా కనిపించడంతో అన్నదాత గుండెల్లో గుబులు రేగుతున్నది. కరీంనగర్, పెద్దపల్లి, నిజామాబాద్ జిల్లాల్లో ఈ పరిస్థితి మరీ ఎక్కువగా ఉన్నది. చీడపీడల నివారణ చర్యలు తీసుకోవడంలో వ్యవసాయశాఖ క్షేత్రస్థాయిలో కదలకపోవడం, స్థానికంగా దొరుకుతున్న మందులతో ఐదారుసార్లు పిచికారి చేస్తున్నా రోగం కుదుటపడకపోవడంతో అన్నదాత మరోసారి అప్పుల ఊబిలో కూరుకుపోయే పరిస్థితి ఏర్పడుతున్నది.

అటు ఎస్సారెస్పీ, ఇటు కాళేశ్వరం నీళ్లు ఈ యాసంగిలో అవసరం మేరకు అందుబాటులో ఉన్నాయి. దీంతో వరి సాగు రెండింతలైంది. ఆరేండ్ల రికార్డు బద్దలుకొడుతూ నిజామాబాద్‌లో అదనంగా 3లక్షల ఎకరాల్లో కలిపి మొత్తంగా 4లక్షలా 75వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. కరీంనగర్ జిల్లాలో యాసంగి సాధారణ సాగు విస్తీర్ణం 99వేలా660 ఎకరాలు కాగా ఏకంగా 2లక్షలా 21వేలా 132 ఎకరాల్లో వరి వేశారు. గతేడాది లక్షా 21వేలా 765 ఎకరాలతో పోల్చితే రెండింతలుగా ఉంది. ఇలా రాజన్నసిరిసిల్ల జిల్లాలోనూ లక్షా 20వేల ఎకరాలు, కామారెడ్డిలో లక్షా 75వేల ఎకరాల్లో వరి సాగవుతోంది. ఇంత పెద్దఎత్తున పచ్చటిపొలాలను పరుచుకున్న జిల్లాను అగ్గితెగులు అంటుకుంటున్నది.

అంచనాల్లేని వ్యవసాయశాఖ

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో అధికారులు కొంత ప్రాథమిక అంచనాకు వచ్చారు. నిజామాబాద్‌లో 6వేలు, కామారెడ్డిలో 1700 ఎకరాల్లో అగ్గితెగులు సోకినట్టు చెబుతున్నారు. వాస్తవ పరిస్థితుల్లో మాత్రం ఆ నష్టం మూడింతలకుపైనే ఉంటుంది. మరిన్ని రోజులు ఆగితే ఆ సంఖ్య పదింతలూ కానుంది. ఇప్పటికే ఆకుపచ్చ దశలోనే సోకిన అగ్గితెగులను నివారించకపోతే తర్వాతి దశలో మెడవిరుపు ఆశిస్తుంది. పూతదశలో ఏకంగా పాలుపోసుకోక గింజలు తాలుగా మారే ప్రమాదం ఉంది. ప్రస్తుతం ఈ తెగులు ప్రభావం నిజామాబాద్ జిల్లాలోని కమ్మర్‌పల్లి, భీంగల్, ఆర్మూర్, వర్నీ, రుద్రూర్, కోటపల్లి, డిచ్‌పల్లి, జక్రాన్‌పల్లి, ఎడపల్లి, నవీపేట మండలాల్లో ఎక్కువ కనిపిస్తోంది. కరీంనగర్ జిల్లాలో హుజూరాబాద్, జమ్మికుంట, శంకరపట్నం, చొప్పదండి, సిరిసిల్ల జిల్లాలో బోయిన్‌పల్లి, చందుర్తి, జగిత్యాల జిల్లాలో కొడిమ్యాల, మేడిపల్లి, గొల్లపల్లి, పెద్దపల్లి జిల్లాలో పెద్దపల్లి, సుల్తానాబాద్, ఎలిగేడు మండలాల్లో అగ్గితెగులు మరింత విజృంభిస్తోంది. గతేడాది దోమ'పోటు'తో వరి ఊడ్చుకుపోయిన అనుభవం కండ్లెదుటే ఉంది. ఇప్పుడు అగ్గితెగులును ప్రాథమిక స్థాయిలోనే గుర్తించామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో రైతాంగానికి అవగాహన కల్పించిన దాఖలాల్లేవు.

ఎడాపెడా ఫెస్టిసైడ్ వినియోగం, దిగుబడిపై ప్రభావం

తెగులు ప్రారంభమైనప్పటి నుంచి రైతులు స్థానికంగా అందుబాటులో ఉన్న ఫెస్టిసైడ్ మందులను విరివిగా వినియోగిస్తున్నారు. 'ఇప్పటికి ఐదుసార్లు మందుపిచికారీ చేసినా ఫలితం లేకండా పోయింది' అంటూ కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మొలంగూర్ రైతులు 'నవతెలంగాణ'తో చెప్పాడు. ఎకరా సాగుకు అదనంగా మందుల ఖర్చు రూ.10వేల వరకు అవుతుందంటూ చెప్పుకొచ్చాడు.

పనిగంటలు పెంచితే సహించబోం : సిఐటియు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో ఎనిమిది గంటల విధానాన్ని 12 గంటలకు పెంచితే సహించబోమనీ, ఐక్యపోరాటాలతో కార్మికుల హక్కులు కాపాడుకుంటామని సిఐటియు నేతలు అన్నారు. హైదరాబాద్‌లోని సిఐటియు రాష్ట్ర కార్యాలయం ఎదుట ఎర్రజెండాను సిఐటియు సీనియర్ నాయకులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రాజారావు ఎగురవేశారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్.రమ నేతలతో ప్రతిజ్ఞ చేయించారు. మేడే శుభాకాంక్షలను మాజీ ఎమ్మెల్సీ చుక్క రామయ్య ఫోన్ ద్వారా తెలిపి తన సందేశాన్ని వినిపించారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్, ఉపాధ్యక్షులు పి.జయలక్ష్మి, ఆఫీస్‌బేరర్లు వంగూరిరాములు, పద్మశ్రీ, ఆయా ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎస్వీకేలో జెండా ఎగురవేసిన పారిశుధ్య కార్మికురాలు సీతమ్మ

హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో గల సుందరయ్య విజ్ఞాన కేంద్రం (ఎస్వీకే)లో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సీనియర్ స్వీపర్ సీతమ్మ ఎర్రజెండాను ఎగురవేశారు. పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్వీకే ట్రస్టు కార్యదర్శి ఎస్.వినయకుమార్, సభ్యులు రఘుపాల్, పూర్వ ట్రస్టీ సాంబిరెడ్డి, మోదుగుపూలు ఎడిటర్ భూపతి వెంకటేశ్వర్లు, సత్యం, రాములు, తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో ఎర్ర జెండాను ఎగురవేస్తున్న సీనియర్ నాయకులు పి. రాజారావు

హక్కుల సాధనకు ఐక్య పోరాటాలు : చాడ

పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఐక్య పోరాటాలు చేయనున్నట్టు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ఏఐటియుసి రాష్ట్ర కార్యాలయం ఎదుట ఆయన ఎర్రజెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం, నగర ప్రధాన కార్యదర్శి నర్సింహ్మా, నాయకులు పాల్గొన్నారు.

భిక్కనూర్‌లో భారీ వర్షం

- తడిసిన ధాన్యం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో ధాన్యం తడిచిముద్దయింది. సిద్ధరామేశ్వర నగర్, జంగంపల్లి, బస్వాపూర్, ఆయా గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షానికి భారీ చెట్లు, విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. ఇండ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. జాతీయ రహదారిపై ఆరబెట్టిన ధాన్యం గాలికి కొట్టుకుపోయాయి. ప్రభుత్వం స్పందించి పంట నష్టపోయిన రైతులను, ఇండ్లు కూలిపోయిన బాధితులను ఆదుకోవాలని బాధితులు కోరారు. రంగారెడ్డి జిల్లా కొందుర్గు, కందుకూర్, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్ మండలాల్లో ఈదురుగాలులతో వర్షం కురిసింది. వికారాబాద్ జిల్లాలో మామిడికాయలు నేలరాలయి. అక్కడక్కడ విద్యుత్ స్తంభాలు పడిపోయాయి.

అన్న కాళ్లూ చేతులు కట్టేసి.. చెట్టుకు ఉరేసి హత్యాయత్నం

ఆలస్యంగా వెలుగుచూసిన భూ వివాదం

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

అన్నదమ్ముల మధ్య భూవివాదం అన్నపై హత్యాయత్నానికి దారితీసింది. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కందనూలు మండలం తూడుకుర్తి గ్రామంలో శుక్రవారం వెలుగులోకి రావడం తీవ్ర చర్చనీయాంశమైంది. స్థానిక ఎస్ఐ మాధవరెడ్డి వివరాల ప్రకారం.. అన్నదమ్ములైన గుంటి తిరుపతయ్య, కురుమయ్యలకు వారసత్వంగా వచ్చిన మూడెకరాల భూమిని పంచుకునే విషయంలో తరుచూ ఘర్షణ జరుగుతుండేది. పంచాయితీలో ఇద్దరు సమానంగా పంచుకోవాలని గ్రామ పెద్దలు సూచించారు. ఇది సహించని తమ్ముడు కురుమయ్య పథకం ప్రకారం ఏప్రిల్ 29న సాయంత్రం తిరుపతయ్య పొలంలో భూమి చదును చేస్తుండడాన్ని గమనించి కుటుంబ సభ్యులతో కలిసి దాడి చేశాడు. కాళ్లూ చేతులు కట్టేసి తీవ్రంగా గాయపరిచి ఈడ్చుకెళ్లి చెట్టుకు ఉరేసి హత్య చేయడానికి యత్నించాడు. గమనించిన తిరుపతయ్య కుమారుడు స్థానికులతో పాటు పోలీసులకూ సమాచారమందించాడు. ఈ మేరకు కురుమయ్య కుటుంబ సభ్యులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

కార్డుదారులందరికీ ఉచిత బియ్యం

పౌర సరఫరాల సంస్థ చైర్మెన్ శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో -

రెండో విడత ఉచిత బియ్యం తెల్లరేషన్ కార్డుందరికి అందుతాయని రాష్ట్ర పౌర సరఫరాలసంస్థ చైర్మెన్ ఎం. శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నగర మేయర్ బొంతు రామ్మోహన్, ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో కలిసి శుక్రవారం పంజాగుట్టలోని ఓ రేషన్‌షాపులో ఉచిత బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు భౌతిక దూరం పాటిస్తూ ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఏప్రిల్ నెలలో 2కోట్ల 52లక్షల మంది లబ్ధిదారులకు 3లక్షల 18వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేసినట్టు తెలిపారు. మేనెలలో బియ్యంతో పాటు రూ. 1,500 నగదు పంపిణీ చేస్తామని తెలిపారు. కిలో కందిపప్పును ముందుగా నిజామాబాద్, వరంగల్ రూరల్, నల్లగొండ, మెదక్ జిల్లాల్లో పంపిణీ చేస్తామనీ, తర్వాత హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లాల్లో పూర్తిస్థాయిలో కందిపప్పు పంపిణీ చేయనున్నట్టు వివరించారు.

బిజెపి చేతిలో ఢిల్లీ పోలీసులు

రాష్ట్రంలో మత రాజకీయాలకు తావులేదు : మంత్రి ఈటల వ్యాఖ్యలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మర్కజ్ ప్రార్థనల నిమిత్తం ఢిల్లీకి వచ్చిన వారిలో ఇండోనేషియాకు చెందిన వారు ఎక్కువగా ఉన్నారని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖా మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. అయితే ఢిల్లీ పోలీసులందరూ బిజెపి చేతిలోనే ఉన్నారని విమర్శించారు. అలాంటప్పుడు మర్కజ్ బాధితులను ఆ పార్టీ ఎందుకు నిలువరించలేదని ప్రశ్నించారు. శుక్రవారం ఈటల హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. తమ ప్రభుత్వంపై విమర్శలు చేయటం బిజెపి నేతలకు ఆనవాయితీగా మారిందన్నారు. రాష్ట్రంలో పర్యటించిన కేంద్ర బృందం.. ఇక్కడి వైద్య సేవలను ప్రశంసించిందని గుర్తు చేశారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ కూడా తమ ప్రభుత్వ పనితీరును మెచ్చుకుందని తెలిపారు. వీటిని పట్టించుకోని బిజెపి నేతలు.. అదే పనిగా విమర్శలు చేస్తున్నారని అన్నారు. దేశవ్యాప్తంగా కరోనా మరణాల రేటు 3.5గా ఉంటే, మన దగ్గర 2.5గా ఉందని తెలిపారు. మర్కజ్‌కు వెళ్లొచ్చిన వారిని తొలుత తెలంగాణ ప్రభుత్వమే గుర్తించిందని చెప్పారు. తద్వారా తాము దేశాన్నే అలెర్ట్ చేశామని అన్నారు. ఇండోనేషియా నుంచి వచ్చిన వారితో తాము మీటింగులు పెట్టలేదనీ, సన్మానాలు చేయించుకోలేదని చెప్పారు. ఏ ఒక్కరినీ ఉపేక్షించకుండా కఠినంగా వ్యవహరించామని తెలిపారు. మత పెద్దలతో మాట్లాడి సమస్య తీవ్రతను తెలియజెప్పామన్నారు. అంతర్జాతీయ విమానాలు రద్దు చేయాలంటూ కేంద్రానికి సూచించింది తమ ప్రభుత్వమేనని చెప్పారు. కొంత మంది మతం గురించి మాట్లాడుతున్నారనీ, రాష్ట్రంలో అలాంటి రాజకీయాలకు తావులేదని ఈటల స్పష్టం చేశారు.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలపై ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. దీంతో 10 మంది గాయపడ్డారు. ఈ ఘటన జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. గాయపడిన కూలీలను మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అందులో ముగ్గురు పరిస్థితి తీవ్రంగా ఉండటంతో జగిత్యాల ఏరియాస్పత్రికి తరలించారు. పల్లగుట్టకు ఇటువైపున కూలీలు ఉపాధి హామీ పనుల్లో భాగంగా కందకాలు తీస్తున్నారు. గుట్టకు అవతలివైపున కొందరు తునికాకు తెంపుతుండగా తేనెటీగలు దాడి చేశాయని కూలీలు చెప్పారు.

సింగరేణి కార్మికుడి మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం ఆర్జీ-3 గనిలో విధులు నిర్వర్తిస్తున్న ఓ కార్మికుడు ప్రమాదవశాత్తు మృతిచెందాడు. గోదావరి ఖనికి చెందిన సింగరేణి కాంట్రాక్టు కార్మికుడు కోడూరి స్వామి(45) సింగరేణి ఆర్జీ-3 ఆండ్రియాల లాంగ్వార్ ప్రాజెక్టులో విధులు నిర్వర్తిస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి బోరు బావి తవ్వే యంత్రానికి పైపులు బిగించే క్రమంలో అదుపుతప్పి కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయమై మృతిచెందాడు. లాంగ్వార్ ప్రాజెక్టులో గ్యాస్ వెలువడటంతో అత్యవసర నిమిత్తం సెకండ్ షిఫ్ట్‌లో ఎస్ఈఆర్ఎం-69 డ్రిల్ టాప్ వద్ద అతను పని చేశాడు.

అంగన్‌వాడీల ద్వారా అరటి పండ్లు పంపిణీ

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గిరిజన ప్రాంతాల్లోని గర్భిణీలు, పిల్లలకు అరటిపండ్లను పంపిణీ చేయాలని అధికారులు కసరత్తు ప్రారంభించారు. గిరిజన ప్రాంతాల్లో రైతులకు పంట నష్టం కాకుండా తోడ్పాటునందించేందుకు ప్రభుత్వం భావిస్తున్నది. గిరిజన ప్రాంతాల్లోని ఐటీడీఏ పరిధిలో గల పాఠశాలల విద్యార్థులకు పోషకాహారం అందించేందుకు గిరిజన శాఖ అక్కడి రైతులు పండించే అరటిపండ్లు కొనుగోలు చేసేది. అయితే కరోనా వైరస్ నేపథ్యంలో పాఠశాలలు మూతపడడంతో గిరిజన ప్రాంతాల్లోని అరటి రైతులు తమ పంటను వేరే చోటుకు తీసుకెళ్లి అమ్ముకోవడం ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలో అరటి పండ్ల రైతుల నుంచి గిరిజన శాఖ ఆధ్వర్యంలో కొనుగోలు చేసి, వాటిని అంగన్ వాడీ కేంద్రాలకు సరఫరా చేసి, అక్కడి నుంచి వాటిని అంగన్ వాడీ కేంద్రాల్లో నమోదు చేసుకున్న గర్భిణీలు, చిన్నపిల్లలకు అందించేందుకు మంత్రి సత్యవతి రాథోడ్ ఆదేశాల నేపథ్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి.

వలస కూలీలను కేంద్రమే తరలించాలి

ఎఐఎడబ్ల్యూయూ జాతీయ ప్రధాన కార్యదర్శి వెంకట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వలస కూలీలను స్వస్థలాలకు కేంద్రమే చేర్చాలని రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం మేడే సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో ఎఐఎడబ్ల్యూయూ జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, తెలంగాణ రైతు సంఘం కార్యాలయంలో ఎఐకెఎస్ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి, జెండావిష్కరణ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ దేశంలో దాదాపు 14 కోట్ల మంది వలస కూలీలు ఉన్నారనీ, వారిని స్వస్థలాలకు చేర్చే బాధ్యతను కేంద్ర ప్రభుత్వమే తీసుకోవాలన్నారు. ప్రతి వ్యవసాయ కూలీ, రైతు, అసంఘటిత రంగ కార్మికుల కుటుంబానికి రూ. 7,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థూల జాతీయ ఉత్పత్తిలో కనీసం పది శాతం లాక్‌డౌన్ సందర్భంగా కేంద్రం ప్యాకేజీ ప్రకటించాలని కోరారు. కార్మికుల పని గంటలు పెంచే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు .ప్రజా వైద్యాన్ని మెరుగు పరచాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. పరిశ్రమల్లో జీతాలు చెల్లించాలని ప్రభుత్వాలు చెప్పినా యాజమాన్యాలు అమలు చేయడం లేదని అన్నారు. రైతులు పండించిన పంటలను మద్దతు ధరలకు కొనుగోలు చేయాలని కోరారు. రైతులకు సకాలంలో డబ్బులు చెల్లించాలనీ, గన్ని బ్యాగుల కొరత తీర్చాలని కోరారు. ఉపాధి హామీ కూలీలకు పని స్థలాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్, ఎఐఎడబ్ల్యూయూ రాష్ట్ర అధ్యక్షులు బి. ప్రసాద్, ఉపాధ్యక్షులు బొప్పని పద్మ తదితరలు పాల్గొన్నారు.

ఆదాయం ప్రభుత్వానికి.. వ్యర్థాలు రైతులకు

పంట భూముల్లో 'మేడారం' చెత్తకుప్పలు

- రైతులకు పరిహారం ఇవ్వని ప్రభుత్వం
- తొలగింపునకు ఎకరాకు రూ.10వేలకు పైగా ఖర్చు
- కోర్టు మెట్లెక్కినా కనికరం చూపని ప్రభుత్వం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లక్షలాదిమంది సంతోషం కోసం తాము నష్టపోతున్నా పంట భూములను బీడుగా వదిలేశారు రైతులు.. కానీ, వారికి చివరికి మిగిలింది వ్యర్థాలే. మేడారం జాతర నేపథ్యంలో పరిసర ప్రాంతాల రైతులకు ప్రభుత్వం పరిహారం ఇవ్వకపోగా.. జాతర వ్యర్థాల కుప్పలను తొలగించకుండా వదిలేసింది. దాన్ని తొలగించేందుకు రైతులు సొంతంగా ఎకరాకు రూ.10వేల చొప్పున ఖర్చు చేస్తున్న పరిస్థితి. పంట నష్టపోతున్న తమకు పరిహారం ఇవ్వాలని కోర్టు మెట్లు ఎక్కినా సమస్య పరిష్కారం కాలేదు. భవనాల నిర్మాణానికి లాక్కున్న స్థలాలకూ ప్రభుత్వం పరిహారమివ్వట్లేదు. మేడారం జాతరతో ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయం వస్తున్నా.. రైతులకు పరిహారం ఇవ్వడానికి వెనుకాడుతోంది.

రెండేండ్లకోసారి మేడారం జాతర జరుగుతుండగా.. ఆ సమయంలో అక్కడి రైతులు ఒక పంటను పూర్తిగా వదులుకుంటున్నారు. నార్లాపూర్, కొత్తూరు, ఊరట్టం, కన్నెపల్లి, మేడారం, రెడ్డిగూడెం తదితర ప్రాంతాల్లో 10వేల ఎకరాలకు పైగా సారవంతమైన భూములు ఉన్నాయి. జాతర సందర్భంగా 4వేల ఎకరాల్లో పంట నష్టం జరుగుతోంది. 2018 జాతరలో మాదిరిగానే 2020లోనూ రైతులు రబీ సాగును వదులుకున్నారు. 2022లోనూ రబీ పంటను వదులుకోవాలి. ఎకరా భూమిలో 40 నుంచి 50 బస్తాల ధాన్యం దిగుబడి వస్తుంది. అంటే 35 క్వింటాళ్లు... రూ.65వేల విలువైన పంట. జాతర సందర్భంగా ఒక్కో రైతు మూడు, నాలుగు ఎకరాలకుపైగా బీడుగా వదిలేయాల్సిన పరిస్థితి. పంటలు పూర్తిగా వదులుకుంటున్నందున పరిహారమివ్వాలని రైతులు ప్రభుత్వాన్ని కోరారు. కనికరం చూపలేదు.

దీంతో గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో హైకోర్టులో కేసు వేశారు. పరిహారం ఇవ్వాలని కోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించినా ఇవ్వడం లేదు. పైగా రైతులు సాగు చేసే భూములు ప్రభుత్వానివంటూ ఏటేటా లాక్కుంటున్నారు.

పొలాల నిండా వ్యర్థాలే..

జాతర సందర్భంగా మేకలు, గొర్రెలు, కోడి వ్యర్థాలను పూర్తిగా పొలాల్లోనే వదిలేశారు. జనానికి సౌకర్యం కల్పించడం కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక మరుగుదొడ్ల రేకులు తొలగించారు తప్ప పైపులు, కాంక్రీట్ గచ్చు తొలగించలేదు. రైతు పొలం చుట్టూ లోతుగా కందకం కొట్టారు. దానిని పూడ్చలేదు. స్నానగట్టాల కోసం 200 గజాల వెడల్పులో కులాయిలు ఏర్పాటు చేశారు. వాటి గచ్చు తీయలేదు. పొలాల నిండా మేక, కోడి బొక్కలే ఉన్నాయి. ఇలా మేడారం చుట్టూ పొలాలన్నీ వ్యర్థాలతో నిండి ఉన్నాయి. పారిశుధ్య పనుల్లో వాటిని ముట్టుకోలేదు. గతంలో నారాయణరెడ్డి కలెక్టర్‌గా ఉండగా వ్యర్థాలు తొలగించి చదును చేసి ఇస్తామని హామీ ఇచ్చారు. ఆయన తరువాత నలుగురు కలెక్టర్లు మారారు. ఇప్పుడు ఎవరూ ఏమీ చెప్పడం లేదు. ఎకరం పొలంలో బొక్కలు, వ్యర్థాలు, గోతులు పూడ్చేందుకు రూ.10వేలు ఖర్చువుతున్న పరిస్థితి. అధికారులు చేతులెత్తేయడంతో రైతులే చదును చేసుకోవడానికి సిద్ధమవుతున్నారు. మేడారం చుట్టున్న పొలాల్లో నాట్లు వేయడానికి కూలీలు రాని పరిస్థితి. చదును చేసిన పొలంలో నాటు వేస్తున్న సందర్భంగా ఒక కూలీకి మేక బొక్క కుచ్చుకుపోయి సెప్టిక్ అయింది. అందుకు వైద్యానికి పూర్తి ఖర్చు రైతే పెట్టుకోవాల్సి వచ్చింది. ఆ ఘటన తరువాత తాడ్వాయి కూలీలు నాట్లు వేయడానికి రాకపోవడంతో నార్లాపూర్, పస్రా నుంచి తీసుకొచ్చి అదనపు కూలి ఇచ్చి వేయించుకుంటున్నారు.

అటెండర్లే లైబ్రేరియన్లు

1040కిగాను 410 మందే ఉద్యోగులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తాత్కాలిక అటెండర్లు, స్వీపర్లే లైబ్రరీయన్లుగా అవతారమెత్తారు. ఒకే ఉద్యోగి రెండు నుంచి ఐదారు గ్రంథాలయాలను పర్యవేక్షిస్తున్నారు. లైబ్రరీలకు సంబంధించి బరువు, బాధ్యత అంతా తాత్కాలిక సిబ్బందిదే. ఒక్క చోట అని కాదు... రాష్ట్రమంతటా ఇదే పరిస్థితి. వందల కోట్లకు చేరుకున్న సెస్ బకాయిలు సంస్థ మనుగడకు గుదిబండగా మారాయి. భాషాభివృద్ధికి, స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తికి దోహద పడ్డ గ్రంథాలయాలు నేడు అవసాన దశకు చేరుకుంటున్నాయి. నిధుల లేమి, ఉద్యోగుల కొరత, అద్దె భవనాలతో సతమతమవుతున్నాయి. వెరసీ మొత్తం వ్యవస్థనే శిథిలావస్థకు చేరుకుంది. దీంతో పోటీపరీక్షలకు తయారయే నిరుద్యోగులు, పుస్తక ప్రియులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. రాష్ట్రంలో ఉన్న 676 లైబ్రరీల్లో మొత్తం 1040 మంది ఉద్యోగులు పని చేయాల్సిన అవసరముంది. కాగా కేవలం 410 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. 2002లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చేపట్టిన నియామకాలు మినహా స్వరాష్ట్రంలో కొత్తగా ఎలాంటి ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయలేదు. దీంతో ఉన్న అరకొర ఉద్యోగులే అన్ని బాధ్యతలూ చూస్తున్నారు. స్థానికంగా జిల్లా గ్రంథాలయాల సంస్థలు తమ జిల్లాల్లో తాత్కాలిక, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని అక్కడక్కడ నియమించుకోవడం మినహా పూర్తి స్థాయి భర్తీలకు ప్రభుత్వం చొరవచూపలేదు. ఒకే లైబ్రరియన్ చుట్టు పక్కల ఉన్న నాలుగైదు గ్రంథాలయాలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. దీంతో స్థానికంగా ఉన్న తాత్కాలిక అటెండర్లు, స్వీపర్లే గ్రంథాలయాల బాధ్యతలను మోస్తున్నారు. తాత్కాలిక ఉద్యోగులు అనుకోని పరిస్థితుల్లో సెలవులో ఉన్నా, మరే ఇతర కారణంతో రాకపోతే ఆరోజు అక్కడి గ్రంథాలయం తెరిచేవారే ఉండరు. మూతపడాల్సిందే. కొత్త జిల్లాల్లో గ్రంథాలయాల సంస్థ కార్యదర్శుల పోస్టుల్లో నూతనంగా నియామకాలు చేయలేదు. పూర్వపు జిల్లా గ్రంథాలయాల సంస్థ కార్యదర్శులే అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. స్వీపర్, అటెండర్ నుంచి మొదలుకొని హైదరాబాద్‌లోని రాష్ట్ర గ్రంథాలయాల డైరెక్టర్ కార్యాలయం వరకు ఇదే పరిస్థితి నెలకొంది.

పేరుకు పోయిన సెస్ బకాయిలు

జీహెచ్ఎంసీతో పాటు రాష్ట్రంలోని మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు, గ్రామపంచాయతీలు ప్రభుత్వం నిర్దేశించిన లైబ్రరీ సెస్‌ను దర్జాగా వసూలు చేసుకొని సొంతానికి వాడుకుంటున్నాయే తప్ప గ్రంథాలయ సంస్థకు చెల్లించడం లేదు. ప్రభుత్వం సొంతగా నిధులు ఇవ్వకపోయినా గ్రంథాలయాలకు రావల్సిన సెస్ బకాయిలను వసూలు చేసేందుకు తోడ్పాటు అందించడం లేదు. ఫలితంగా గత కొన్నేండ్లుగా బకాయిలు పేరుకుపోయాయి. 2018-19 ఆర్థిక సంవత్సరం చివరి వరకు సెస్ బకాయిలు రూ. 400 కోట్లకు చేరుకోగా, ఇందులో జీహెచ్ఎంసీ బకాయే రూ. 329 కోట్లుగా ఉండటం గమనార్హం.